TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 162 | ఎడిటర్ : ఎం. రమేష్ | సోమవారం, మే 13, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-


## ఏపీలో సార్వత్రిక సమరం

- తీర్పు ఇవ్వబోతున్న ఓటరు
- జగన్, చంద్రబాబుల భవితవ్యంపై తీర్పు
- 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ
- ఉదయం 7నుంచే పోలింగ్ ప్రారంభం
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- భారీ బందోబస్తు మధ్య ప్రత్యేక బస్సుల్లో తరలింపు
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



4

## ఉండవల్లిలో ఓటేయనున్న చంద్రబాబు



**అమరావతి, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సందడి నెలకొంది. సోమవారం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఉండవల్లిలో నేటి ఉదయం 7.00 గంటలకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓటు వేయనున్నారు. ఉండవల్లిలోని గాదె రామయ్య – సీతారావమ్మ మండల పరిషత్ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే పోలింగ్ నేపథ్యంలో ఆయా కేంద్రాల చుట్టుపక్కల పరిసరా ప్రాంతాల్లో ఎన్నికల సంఘం పటిష్ట భద్రత చర్యలు చేపట్టింది. ఏపీలో ఏలాంటి ఘర్షణ వాతావరణం చోటుచేసుకోకుండా పోలీసులు భారీ భద్రత చర్యలు చేపట్టారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు నిరంతరం ఎన్నికల సరళి పకడ్బందీగా జరిగేలా ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తుంది. ఉదయం 7 గంటల నుంచి తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని 96 ఎంపీ స్థానాల కోసం పోలింగ్ జరుగనుంది.

## నేడు నాలుగో విడత
## సార్వత్రిక ఎన్నికల పోలింగ్

- పది రాష్ట్రాల్లో 96 స్థానాలకు ఎన్నిక
- ఏపీలో 25, తెలంగాణలో 17 స్థానాలకు పోటీ
- ఎంపీ ఎన్నికలతో పాటే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు
- బరిలో యూపిలో సమాజ్‌వాదీ నేత అఖిలేష్ యాదవ్
- భారీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

సోమవారం దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నాలుగో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం అయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం భద్రతా ఏర్పాట్లు చేసింది. నాలుగో విడతలో ఏపీ, తెలంగాణ సహా మొత్తం 10 రాష్ట్రాల్లో నేడు పోలింగ్ జరగనుంది. నాలుగో విడతలో 96 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. ఏపీ(25), తెలంగాణ (17), బిహార్(5), ఝార్ఖండ్(4), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), ఒడిశా(4), యూపీ(13), ప.బెంగాల్(8), జమ్ముకశ్మీర్(1) స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. లోక్‌సభతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఇదే విడతలో పోలింగ్ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో కీలక నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ విడతలో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పోటీ చేస్తున్న కన్నౌజ్ నియోజకవర్గంలో పోలింగ్ జరుగుతోంది. బీజేపీకి కంచుకోటగా ఉన్న ఉత్తరప్రదేశ్ లో కన్నౌజ్‌తో పాటు షాజహాన్‌పూర్, ఖేరీ, ధౌరహర, సీతాపూర్, హర్దోయి, మిస్రిఖ్, ఉన్నావ్, ఫరూఖాబాద్, ఎటా, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్ నియోజవర్గాల్లో రేపు ఎన్నికలు నిర్వహించనున్నారు. 4వ విడతలో పోటీలో ఉన్న ప్రముఖుల్లో అఖిలేష్‌తో పాటు టీఎంసీ నేతలు మహువా మొయిత్ర వెస్ట్ బెంగాల్ కృష్ణనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్నారు. అలాగే తృణముల్ కాంగ్రెస్ నేత శత్రుఘ్న సిన్హా ఆసన్సోల్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ ముఖ్య నేతలు గిరిరాజ్ సింగ్ బీహార్‌లోని బేగుసరాయి నియోజకవర్గంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఝార్ఖండ్ నుంచి ఖుంటి నియోజకవర్గంలో అర్జున్ ముండా పోటీ చేస్తున్నారు. మూడో విడతలో అధికారంలో ఉన్న అమిత్ షా వంటి అగ్రనేతలు బరిలో నిలిస్తే ఇప్పుడు ప్రతిపక్షంలోని ముఖ్యనేతలు ఎన్నికల్లో పోటీ చేయడంతో ఆసక్తిగా మారింది.

## మే 13వ తేదీన ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా
## ఓటు హక్కు వినియోగించుకోవాలి

- రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రజలందరి బాధ్యత
- జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

2






తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# మే 13వ తేదీన ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రజలందరి బాధ్యత
- జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

**కర్నూలు, మే 12 (పీపుల్స్ మోటివేషన్):-**

మే 13వ తేదిన ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు...త్రాగు నీరు, షేడ్స్, వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేశామన్నారు..పోలింగ్ కేంద్రాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలుగా ఉన్న ఓటర్లకు తగిన సహకారం అందించేందుకు ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలకు చెందిన సహాయకులను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. వీరు త్వరితగతిన ఓటు హక్కు వినియోగించుకునేలా సహాయకులు తోడ్పడతారని తెలిపారు.. వికలాంగుల కోసం. ప్రతి పోలింగ్ స్టేషన్ లో వీల్ చైర్స్ ఏర్పాటు చేశామన్నారు...సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బలగాల ద్వారా భద్రత కల్పించడం జరుగుతోందని, ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ రోజున వర్షం వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు వీలైనంత త్వరగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రజలందరి బాధ్యత అని, సోమవారం జరగబోయే ఎన్నికల పండుగ లో ఓటర్లు అందరూ పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు..జిల్లాలో ఉన్న ఓటర్లు అందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# జోరుగా ప్రలోభాల పర్వం

- ఓటు కోసం నానా తంటాలు
- మద్యంతో పాటు ప్యాకేజీలు
- ఓటుకు నోటు పంచుతున్న నేతలు

**విజయవాడ, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

ఎన్నికల ప్రచారం ముగియడంతో గతరాత్రి నుంచి ప్రలోభాల పర్వానికి తెరలేచింది. పోలింగ్‌కు కొద్ది గంటలే మిగిలి ఉండడంతో ఓటర్లను ప్రలోభ పర్చుకునే క్రమంలో పోటీచేస్తున్న అభ్యర్థులు అప్రమత్తమయ్యారు. మద్యంతో పాటు నోట్లను అప్పగించే ప్రక్రియలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల బాహాటంగానే సాగింది. ఇందుకోసం నేతలు భారీగా మద్యాన్ని కొనుగోలు చేసి పంపిణీకి సిద్దంగా ఉంచారు. రహస్య ప్రాంతాల్లో డంప్ చేశారని తెలుస్తోంది. అధికారులు దాడులు చేసిన పట్టుకున్నా..కార్యక్రమం మాత్రం ఆగడం లేదు. పోలింగ్ కు ఒకరోజు ముందుగా పంపిణీకి స్థానిక బూత్‌లెవల్ కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. తమను గెలిపించాలంటూ ఇన్నాళ్లూ పోటాపోటీగా ప్రచారం చేసిన అభ్యర్థులు.. ఇప్పుడు పోల్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టారు. ఓటర్లకు నగదు, మద్యం పంచడం షురూ చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో పది రోజుల క్రితమే పంపకాలు మొదలుకాగా.. మంగళవారం రాత్రి నుంచి అన్ని నియోజకవర్గాల్లో జోరు పెంచారు. అభ్యర్థులు ఒకరిని మించి ఒకరు నగదు పంపిణీ చేస్తుండగా, కొన్ని నియోజకవర్గాల్లో మిగతా పార్టీలకు దీటుగా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాల్లో బీజేపీ క్యాండిడేట్లు బిజీగా ఉన్నారు. త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఒక్కో ఓటుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తున్నారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వుడ్ నియోజక వర్గాల్లోనూ ఓటర్లకు ఈసారి భారీగా ముట్టజెప్తున్నట్లు సమాచారం. శనివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు మద్యం అమ్మకాలపై నిషేధం ఉండగా.. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అంతకుముందు గానే ప్లాన్ చేశారు. శివారు ప్రాంతాల్లో భారీ ఎత్తున లిక్కర్ పార్టీలు ఏర్పాటు చేశారు. ఇకపోతే మటన్‌కు ఆర్డర్స్ చేశారు. నగరానికి సంబంధించి ఐటీ ఉద్యోగులు, యూత్ కు టూర్స్ ప్యాకేజ్ ఆఫర్ చేస్తుండగా.. గెలిచాక కోరిన ప్రాంతాలకు తీసుకెళ్తామని హామీలు ఇస్తున్నారు. ఐటీ, ప్రయివేట్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ స్టూడెంట్లను గ్రూపులుగా చేసి టీమ్ లీడర్‌ను కూడా నియమించారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు, నమ్మకమైన అనుచరులకు ఈ బాధ్యతలు అప్పగించారు. శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మందు పార్టీలకు ఓటర్లను తరలించేందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌ను బుక్ చేశారు. ఇప్పటికే పలు రెస్టారెంట్లలో రూమ్స్ బుక్ చేశారు. వాటి పేరుతో టోకెన్స్ ఇస్తుండగా.. ఒక్కో టీమ్‌లో నలుగురిని, వీరిని మానిటరింగ్ చేసేందుకు బూత్‌లెవెల్ లీడర్లకు బాధ్యతలు ఇచ్చారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 వేల వరకు వస్తాయని ఓటర్లు ఆశిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో ఓటుకు అభ్యర్థులు రూ.5 వేలు ముట్టజెప్తున్నారు. ఏరియాలను బట్టి కొందరికి గిఫ్టులు కూడా ఇస్తున్నారు. ప్రత్యర్థులు పంచే మొత్తాన్ని బట్టి మరికొంత ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. గోదావరి జిల్లాలోని జనరల్ నియోజకవర్గాల్లో ఒక్కో ఓటుకు రూ.5 వేల నుంచి రూ.8వేల వరకు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కామారెడ్డిలో ఓటుకు 25వేలు ఇస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.అన్ని చోట్ల మందుతో విందులు ఇస్తున్నారు త్రిముఖ పోటీ ఉన్న సెగ్మెంట్లలో 3 పార్టీల అభ్యర్థులు కలిపి కేవలం ఓటర్లకే రూ.200 కోట్లకు పైగా పంపిణీ చేసే అవకాశం ఉందని తెలుస్తున్నది. కొన్ని చోట్ల మొదటి విడతగా రూ.2 వేల చొప్పున ఇచ్చిన లీడర్లు.. చెప్తున్నారు. ఓటర్లకు నగదు పంపిణీలో వైకాపా అభ్యర్థులే ముందున్నారు. ప్రధాన పార్టీల హెడ్ క్వార్టర్స్ నుంచి పెద్దలు అభ్యర్థులతో మాట్లాడుతూ ఎక్కడెక్కడ వీక్?ఉన్నారు.. ఎంత పంపిణీ చేయాలో ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. నగదు తరలింపునకు ఆటంకాలు ఉండటంతో స్థానికంగానే డబ్బులు సర్దుబాటు చేస్తున్నారు. బడా వ్యాపారవేత్తలు కాంట్రాక్టర్లతో మాట్లాడి డబ్బు సర్దుబాటు చేయాలని, ఆ మొత్తానికి తాము గ్యారంటీ ఇస్తామని ఆయా పార్టీల ముఖ్యులు హామీ ఇస్తున్నారు. నగదు పంపిణీని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు ప్రయత్నాలు చేస్తుండటంతో గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ప్రజలారా ఓటేద్దాం రండి!

ఎన్నికలకు వేళయ్యింది. మనమంతా ఓటేసేందుకు కదలాలి. దీన్నొక యజ్ఞంగా ముందుకు తీసుకుని వెళ్లాలి. ఓటస్తామని బల్లగుద్ది మరీ చెప్పాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోఎన్నికలు జరుగబోతున్న వేళ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి. ఎపిలో అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో ఎంపి ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ప్రజలు ముందుగా ఓటేయడానికి ఇల్లు వదిలి పోలింగ్ బూత్‌కు కదలాలి. ఓటు తమ ప్రజాస్వామ్య హక్కుగా గుర్తించాలి. ఎవరికి ఓటేయాలన్నది వారి ఇష్టం. అయితే ఓటు వేయడం మాత్రం బాధ్యతగా భావించాలి. ఈ దేశంలో ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఒక్కరూ ఓటేయడానికి రావాలి. ప్రలోభాలకు లొంగకుండా ఓటు కోసం కదలాలి. ఓ మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా..తాము కోరుకున్న అభ్యర్థి గెలవాలన్నా ఓటేయాలి. ఓటేస్తే నాకేంటని ఆలోచించే మదందబుద్ది నుంచి బయటపడాలి. మన దేశంలో మన ఓటు ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడ తాయని గుర్తించాలి. గెలిచిన వారు పాలకులుగా మనమీద స్వారీ చేయకుండా..వారిలో భయం ఉండాలంటే ప్రజలు చైతన్యం కావాలి. ప్రజల చెంతకు వచ్చి సమస్యలు విని పరిష్కారం చూపే వ్యక్తులను, పార్టీలనే గెలిపంచుకోవాలి.ప్రజల కోసం పనిచేసే వారిలా నటించే వారిని ఓ కంట కనిపెట్టాలి. అవినీతి అక్రమాలకు దూరంగా ఉండేవారిని గుర్తించాలి. మనోటు వృధా కాదన్న నమ్మకం తెచ్చుకున్న తరవాతనే ఓటేయాలి. ఎవరో చెప్పారనో లేక..మనకు ఎక్కడో దూరపు బంధువనో లేదా తెలిసిని వారికి చుట్టమనో ఓటు వేయరాదు. ఓటు చాలా పరమపవిత్రమైనది. మనం ఓటేయడంతో పాటు..మన తోటివారు కూడా ఓటేసేలా చూడాలి. అవసరమైతే ఓటేసేందుకు మనతోపాటు తీసుకుని వెళ్లాలి. ఇలా ఓటర్లు ఇల్లు కదలి బయటకు వచ్చేలా చేయగలగాలి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న, ఉపాధి పొందుతున్నవేలాదిమంది ఓటేసేందుకు సొంతూళ్లకు వెళ్లారు. నిజంగా ఇది ఓ మంచి పరిణామంగ చూడాలి. ప్రజలు ఇలా తమ ఓటు కోసం చొరవ తీసుకోవడం ముఖ్యం. ప్రజలకు భయపడి పాలన చేసేవారిని గుర్తించి ఓటేయాలి. గతఐదేళ్ల పాలనతో పాటు, స్థానిక ఎమ్మెల్యేల,ఎంపిల పనితీరు, గుణగణాలను ఆలోచించాలి. ఏ పార్టీ అభ్యర్థి అయితే మనకు అందుబాటులో ఉంటాడో ఆలోచన చేయాలి. నిజానికి ప్రజలు మార్పు కోరుకుంటున్నారా లేక..ఉన్న పాలననే అంగీకరిస్తున్నారా అన్నది ప్రజలు ఇచ్చే తీర్పుతో తేలిపోనుంది. ప్రజలు తాము ఆలోచించి ఎవరైతే మంచి పాలన ఇస్తారో అన్నది వివేచించి ఓటేయాలి. పాలన మన కళ్లముందే ఉంది. ఎపిలో వైకాపా పాలన ఎలావుందో..కేంద్రంలో బిజెపి పాలన ఎలావుంటో అన్నదే ఇక్కడ గీటురాయి. వారు రాష్ట్రంలో, కేంద్రంలో మంచి చేస్తున్నారా లేదా అన్నది చూడాలి. ఎపిలో గత ఐదేండ్లలో జరిగిన పరిణామాలను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. పాలకులకు వ్యవసాయ విధానాల్లోనూ నిలకడ లేకపోవటం కూడా రైతన్నలను కలవరపరిచింది. పత్తి, పప్పు దినుసులు, చిరు ధాన్యాల సాగు విషయంలోనూ అస్పష్టత, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అలసత్వంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది రైతులు కళ్లాల వద్దే ప్రాణాలు విడిచారు. పంటల బీమా అమలు చేయాలని రైతాంగం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయం అందక రైతులు విలవిలలాడిపోయారు. ఇక కౌలు రైతులను గుర్తించటానికి కూడా ప్రభుత్వం ఇష్టపడలేదు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో కౌలుదారులే అధికసంఖ్యలో ఉండటం శోచనీయం. బదిలీలు, పదోన్నతులు, రెగ్యులరైజేషన్ జరగక, సకాలంలో జీతాలు రాక ఉద్యోగులు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఇవన్నీ ఎందుకు చెప్పాలంటే సమర్థ నాయకత్వం లేకపోవడం అన్నది గమనించాలి. తాము చేసిందే అభివృద్ధి, చేసిందే సరైనదన్న రీతిలో పాలకులు వ్యవహరించడం మూర్ఖత్వం. ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నాలు జరగడంలేదు. నాయకులు ప్రజలతో నేరుగా సంబంధాలు లేకుండా చేసుకున్నారు. కేవలం కార్పోరేట్, బిజినెస్ రంగాలతో మాత్రమే సంబంధాలు కొనసాగించారు. ఆంధ్రా ఆధిపత్య ప్రాంతాల నాయకులను ఉద్యమ సమయంలో తూలనాడిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆ నాయకులతోనే చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతూ వేలకోట్ల రూపాయల కాంట్రాక్ట్‌లను ఆంధ్ర కాంట్రాక్టర్లకే కట్టబెట్టడం గమనించాం. ఇవన్నీకూడా చర్చినీయాంశాలే. అందుకే ప్రజలు గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. ఎపిలో కూడా జగన్ పాలన ఎలా వుందన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎవరైతే మంచి పాలన ఇస్తారన్నది గమనించి ప్రజలు ఓటేయాలి. ఇక్కడా, అక్కడా పాలకుల తీరేఉ గీటురాయిగా ప్రజలు ఓటేసేందుకు కదలాలి. ప్రజలు తమ ఓటుతో పాలకలను అదీ ప్రజలకు అందుబాటులో ఉండేవారిని ఎన్నుకుంటే సమస్యలను తెలియచేసే అవకాశం వస్తుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు ముందుగా ఓటేయడానికి కదలాలి. హైదరాబాద్ నుంచి లక్షల్లో ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లడం శుభపరిణామం. ఓటేసేందుకు కదిలిన తీరు అభినందనీయం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరూ ఓటేసి చెప్పాలి. మేం ఓటేశామని చెప్పాలి. ప్రజలకు స్పూర్తిగా నిలవాలి. 90శాతం ఓటింగ్ జరగడానికి మనమంతా దోహదపడాలి.

# అపహాస్యంగా ఓట్ల కొనుగోళ్లు

- అపహాస్యం అవుతున్న ప్రజాస్వామ్యం
- ఖరీదైనవిగా మారుతున్న ఎన్నికలు

**అమరావతి, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

ఎన్నికలు అపహాస్యం అవుతున్నాయి. డబ్బులతో ఓట్లను కొనుగోలు చేయడం అన్నది చిటికెలో పని అన్న చందంగా మారింది. ఎన్నికల విన్యాసం చూస్తుంటే ప్రజాప్రతినిధులు ఎన్నికలను పక్కా వ్యాపారంగా మారారు. డబ్బులు పెట్టి ఓట్లు కొనుగోలు చేసి, ప్రజలపై సవారీ చేసేలా తయారవుతున్నారు. గెలుపు లక్ష్యంగా విచ్చలవిడిగా డబ్బు,మద్యం ఖర్చు పెడుతున్న తీరు మన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేదిగా తయారయ్యింది. ఈ ఎన్నికల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ధన ప్రవాహం కొనసాగింది. ఇంతగా డబ్బులు ఎక్కడివి..ఎందుకు ఖర్చు చేస్తున్నారు...గెలిచాక ఏం చేస్తారన్న దానికి సమాధానం లేదు. బహిరంగంగా డబ్బులు పంచుతున్నా అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. విపక్ష పార్టీల అభ్యర్థులపై నిర్బంధం పెంచడం.. రెబల్స్ అభ్యర్థులను కట్టడి చేయడం వంటివే ఇందుకు నిదర్శనమని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. నువ్వా నేనా అన్నట్లుగా పార్టీల మధ్య పోటీ సాగింది. రాజకీయాల్లో ధనప్రభావం ఉన్నంత కాలం ప్రజలకు మేలు జరుగదు. రాజకీయ పార్టీలకు అధికారమే తప్ప ప్రజలు,ప్రజా సేవ అభివృద్ధి కనబడడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ద చూపడం లేదు. ఈ దశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో 75ఏళ్లయినా మన భారత్ రాత మారదు. రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. అప్పుడే ప్రజలకు స్వాతంత్ర్య ఫలం దక్కుతుంది. అప్పుడే భారత్ ఉజ్వలంగా వెలుగుతుంది. ధనరాజకీయాలు ఎంతవరకు సమంజసమో అన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమన్యాయం అందుతుందా అన్నది చూడాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ ఇంకా దారిద్ర్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. ఈ 75 ఏళ్ల వైఫల్యాలపై పాలకులు ఆత్మపరిశీలన చేసుకునే సమయమిదే. రాజకీయాలను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సిన సమయమిది. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్ల డబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమనాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరే సుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది.దేశంలో ఇప్పటికీ సరైన ప్రాజరోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయ రంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. ఈ అసమానతల తొలగింపునకు రాజకీయ సంకల్పం బలంగా ఉండాలి. అలాంటి నాయకులు రావాలి. అలాంటి వారితోనే ఈ దేశం బాగుపడుతుంది తప్ప అప్పటి వరకు గణతంత్రాలు ఎన్నయినా మార్పు రాదు. ధనరాజకీయాలను మార్చాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో నిజాయితీపరులు రావాలి. దేశమంటే అంకితభావం ఉన్న వారి చేతుల్లో పాలన ఉండాలి. అప్పుడే మనం మారుతాం. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసే సంస్కృతికి చరమగీతం పాడకపోతే పెనుముప్పు రాగలదని ప్రజలు కూడా గుర్తించాలి.

# రాజకీయాల్లో మార్పులేని బిజెపి

**మోడీ పాలనలో నెరవేరని హామీలు**

**మూడోసారి నెగ్గేందుకు కసరత్తు**

**న్యూఢిల్లీ, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. మరోమారు అధికారం కోసం చెమటోడ్చిన మోడీ అన్నీ మంచి చేశామని చెపుతున్నారే తప్ప..విమర్శలపై సమీక్ష చేయడం లేదు. క్షేత్రస్థాయి పరిస్థితులు గమనించడం లేదు. అయితే ప్రజలు ఈ ఎన్నికల్లో ఏ మేరకు స్పందిస్తారన్నది ఆయా రాష్ట్రాల్లో ఉన్న సమస్యల ఆధారంగా తెలుస్తుంది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతుత్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ఇటీవలి పరిణామాలు కుటిల రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. బిజెపి లాంటి పార్టీ ఇలాంటి రాజకీయాలు చేయడం వల్ల సహజంగానే దానికున్ని ఇమేజ్ కాస్తా కరిగిపోయేలా చేసింది. పాలన ఎలా ఉన్నా అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు వచ్చింది. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అవినీతి మరక అంటకుండా మోదీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. అవినీతి విషయంలో తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోదీ జాగ్రత్తగా వ్యవహరించారు. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. అనేక రాజకీయ నిర్ణయాల వల్ల ప్రధాని మోదీ నైతికత, నిబద్ధత ప్రశ్నార్థకంగా మారాయి. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. అలాగే గతంలో మీరు చేయలేదా అని ఎదురుదాడి చేయడం ఇటీవల అలవాటయ్యింది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ,షాలకు కూడా తేడా లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడా లన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు.ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నంగా ఉండలేకపోతోంది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
సోమవారం । మే । 13 । 2024



# ఎన్నికలకు ముందే సిరా చుక్క

- డబ్బులు ఇచ్చి ఓటు వేయకుండా కట్టడి
- సోషల్ మీడియాలో ప్రచార దుమారం
- సీరియస్‌గా స్పందించిన ఎన్నికల అధికారి
- అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

**అమరావతి, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

కొందరు కొత్త తరహా రాజకీయ మోసాలకు తెరలేపారు. డబ్బులు ఇచ్చి ఓటేయకుండా ముందే వేలుపై సిరా గుర్తు పెట్టిస్తున్నారన్న ప్రచారం ఎపి రాజకీయాల్లో కలకలం రేపింది.దీనిపై ఫిర్యాదులు కూడా అందాయి. ఇతర సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై మార్కు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా హెచ్చరించారు. ఓటర్ల వేళ్లపై చెరగని సిరాతో మార్కు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని.. అలా చేయడం సరికాదన్నారు. భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే చెరగని సిరా ఉంటుందని అన్నారు. ఒకవేళ ఇతర సిరాలతో ఓటర్ల వేళ్లపై మార్కు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల వేళ ఎవరు నిబంధనలు ఉల్లంఘించిన ఏమాత్రం సహించబోము అని గట్టి హెచ్చరిక చేశారు. ఎన్నికల సిరాపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై సీఈఓ ముఖేష్ కుమార్ మీనా స్పష్టత ఇచ్చారు. ఎలక్షన్ ఇంక్ భారత ప్రభుత్వం దగ్గర మాత్రమే ఉంటుందని.. ఇతరుల దగ్గర ఉండే ప్రసక్తే లేదని చెప్పారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఏపీలో వర్షాలు పడే అవకాశం ఉండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఏదైనా సమస్య వస్తే అదనంగా ఇవిఎంలు రెడీగా ఉన్నాయని మీనా చెప్పారు. వాస్తవానికి ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటరు వేలిపై సిరా వేస్తారు. దొంగ ఓట్లకు చెక్ పెట్టేలా.. ఒకసారి ఓటు వేసిన ఓటరు మరోసారి ఓటు వేయకుండా ఉండేందుకు సిరా మార్క్ వేస్తారు. అయితే, కొంతమంది ఓటర్ల వేళ్లపై ఇంటి దగ్గరే సిరా ముందుగానే మార్క్ చేసి ఓటు వేయకుండా చేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది.. ఈ విషయం ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో ఎన్నికల సంఘం స్పందించింది.. అలాంటి సిరా ఎన్నికల సంఘం దగ్గర మాత్రమే ఉంటుందని.. వేరే వ్యక్తుల దగ్గర ఉండదని ముఖేష్ మీనా తెలిపారు. అలాంటి ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలాఉంటే.. ఏపీలో ఎన్నికలకు సర్వం సిద్ధమైంది.. ఇప్పటికే.. ఈవీఎంలు, వీవీ ప్యాట్ ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. సాయంత్రం నాటికి సిబ్బంది.. కేంద్రాలకు చేరుకోనున్నారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో భారీగా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## ఎన్నికలకు రంగం సిద్ధం

- సొంతూళ్లకు తరలివెళ్లిన నగర ప్రజలు
- దారిబత్తెం ఇచ్చి తీసుకు వెళుతున్న నేతలు

**హైదరాబాద్, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సిటీ నుంచి సొంతూళ్ల బాట పట్టారు. నగరంలో కూలీనాలీ చేసుకునే వారు ఇప్పటికీ సొంతూళ్లలోనే ఓటును కలిగి ఉన్నారు,. వీరంతా ఆయా పార్టీల పిలుపుతో సొంతూళ్లకు బయలుదేరారు. వివిధ జిల్లాలకు వెళ్లేవారు ఒకరోజు ముందుగానే బయలుదేరారు. పోలింగ్ సందర్భంగా వరుసగా రెండు రోజులు సెలవులు కలుపుకుని సోమవారం ప్రభుత్వం సెలవులు ఇచ్చింది. దీంతో శనివారం సాయంత్రం నుంచే కుటుంబాలతో వెళ్తుండగా బస్టాండ్లలో రద్దీ కనిపించింది. ఆదివారం కూడా పెద్ద ఎత్తున బస్టాండ్ల వద్ద, రైల్వే స్టేషన్ల వద్ద రద్దీ కనిపించింది.రెండు మూడు రోజులుగా అడ్డాలపై కూలీలు కూడా పెద్దగా కనిపించడంలేదు. వలస ఓటర్లను సొంతూళ్లకు రావాలని ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు కోరారు. కొద్దిరోజులుగా అభ్యర్థులు కూడా సిటీకి వచ్చి తమ సెగ్మెంట్లలోని ఓటర్లతోనూ ఆత్మీయ సమ్మేళనాలు సైతం నిర్వహించారు. తప్పకుండా వచ్చి ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన వారు నివసిస్తుంటారు. నల్గొండ, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు చెందినవారు ఎక్కువగా ఎల్‌బీనగర్, సాగర్ రింగ్ రోడ్, బీఎన్‌రెడ్డి నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో ఉంటారు. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన వారు మెహిదీపట్నం వైపు, వరంగల్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల వారు ఎల్ బీనగర్, ఉప్పల్ వైపు, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన వారు లింగంపల్లి, బాలానగర్, బోయిన్ పల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో నివసిస్తుంటారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఈసారి వలస ఓటర్లపై దృష్టి సారించారు. ఫోన్లు చేసి ఎప్పుడొస్తున్నారని ఆయా పార్టీల లోకల్ లీడర్లు అడుగుతున్నారు. ఓటర్ల జాబితాల్లోని వివరాలు తెలుసుకుని వారికి ఫోన్లు చేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. పోలింగ్ రోజు వచ్చేందుకు అవసరమైన ప్రయాణ ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కొందరు ఓటర్లను తరలించే పనిలో ఉన్నారు. వీరికోసం ప్రత్యేకంగా వాహనాలు పెట్టారు. ఓటేయడానికి వస్తే అయ్యే ఖర్చులు చెల్లించేందుకు సిద్దంగా ఉన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు
- తెలంగాణ డిజిపి రవిగుప్తా స్పష్టీకరణ

**హైదరాబాద్, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ రవి గుప్తా తెలిపారు. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినిగించుకోవాలి డీజీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర సరిహద్దుల్లో పారామెలిటీ బలగాలతో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ విభాగాలు సహా.. 164 సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరాలను వెల్లడించారు. అలాగే 7వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో బందోబస్తు నిర్వహి స్తున్నా మని, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.186కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, తనిఖీలకు సంబంధించి 8,863 కేసులు నమోదు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కేంద్ర బలాలతో భద్రత ఏర్పాటు చేసామని అన్నారు.

## విజయవాడ బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

**సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక తిప్పలు**

**విజయవాడ, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

ఓటు వేసేందుకు వస్తున్న ప్రయాణికులతో విజయవాడ బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రయాణికులు తమ సొంత గ్రామాలకు

వెళ్లేందుకు బస్టాండ్‌లో నిరీక్షించారు. అయితే రద్దీకి సరిపడా బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేయని పరిస్థితి. విజయవాడ నుంచి గుడివాడ, మచిలీపట్నం, ఏలూరు, గుంటూరు తదితర ప్రాంతాలకు బస్సుల కొరత తీవ్రంగా ఉంది. అటు ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు సరిపడా లేక ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు.అలాగే రెగ్యులర్ సర్వీసులు కూడా ఏ మాత్రం సరిపోవడం లేదు. ఏ ప్రాంతానికీ ప్రత్యేక బస్సులు తిరగడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సుల కోసం పాసింజర్స్ గంటల తరబడి వేచి చూస్తున్నారు. రిజర్వేషన్ కేంద్రాల వద్ద భారీ క్యూతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీసం రిజర్వేషన్ కేంద్రాల సంఖ్యను, సిబ్బందిని కూడా ఆర్టీసీ పెంచలేదు. దీంతో ఆర్టీసీ తీరు పట్ల ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

## సినీ ఫక్కీలో పోలీసుల ఛేజింగ్

- ఇన్నోవా కారులో కోటిన్నర స్వాధీనం

**ఖమ్మం, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల వేళ భారీ మొత్తంలో పోలీసులు డబ్బును స్వాధీనం చేసుకున్నారు. సినిమా ఫక్కీలో ఓ ఇన్నోవా కారును ఛేజ్ చేసి డబ్బు తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. ఈ ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఖమ్మం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపునకు ఓ ఇన్నోవా వెళ్తోంది. నాయకనగూడెం వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఇన్నోవా కారు ఆపితే ఆగకుండా వెళ్లింది. సిబ్బందికి అనుమానం వచ్చి ఆ కారును చేజ్ చేశారు. పది కిలోమీటర్ల మేర పోలీసులు వెంబడించారు. ఈ క్రమంలో దేవుడి తండా వద్ద ఇన్నోవా వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణం చేసిన ఒకరికి గాయాలు కాగా ఆ వాహనంలో కోటిన్నర రూపాయలు పైగా నగదు బయట పడింది. పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మరోవైపు.. మరికొన్ని గంటల్లోనే పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఇలాంటి ఘటనలో జరిగే అవకాశం ఉంది. డబ్బు తరలించే అవకాశం ఉండటంతో పోలీసులు నిఘా పెంచారు.

## నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డిపై చర్యలు

- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు
- అల్లు అర్జున్ పర్యటనలో ఉదాసనీతపై ఆగ్రహం

**అమరావతి, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డిపై చర్యలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల కోడ్ అమల్లో విఫలమైన ఎస్పీపై ఛార్జెస్ ఫైల్ చేయాలని ఈసీ ఆదేశించింది. ఎస్పీతో పాటు ఎస్‌డీపీవో రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ రాజారెడ్డిపైనా శాఖాపరమైన విచారణ జరపాలని డీజీపీకి ఉత్తర్వులు జారీ చేసింది.ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యల వివరాలను ఆదివారం రాత్రి 7గంటల్లోపు తెలియజేయాలని ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. సినీనటుడు అల్లు అర్జున్ నంద్యాల పర్యటనకు సంబంధించి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఈసీ తెలిపింది. ఆయన్ను చూసేందుకు భారీగా అభిమానులు గుమికూడారని, 144 సెక్షన్ అమలులో ఉన్నా జనాలను నియంత్రించటంతో పోలీసులు విఫలమయ్యారని ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అల్లు అర్జున్‌పై ఇప్పటికే కేసు నమోదైందని తెలిపింది. నంద్యాలలో సినీ నటుడు అల్లు అర్జున్ పర్యటన వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఆయన పర్యటనకు రిటర్నింగ్ అధికారి ముందస్తు అనుమతులు ఇవ్వలేదు. నంద్యాల ఎమ్మెల్యే, వైకాపా అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటికి శనివారం ఉదయం అల్పాహారానికి అల్లుఅర్జున్ వచ్చారు. వైకాపా శ్రేణులు వ్యూహాత్మకంగా పట్టణ శివారు నుంచే భారీ వాహనాలు, మోటారు సైకిళ్లతో ప్రదర్శనగా పట్టణంలోకి ఆయనను తీసుకువచ్చాయి. ఆయన పర్యటనకు అధికారిక అనుమతులూ లేకపోయినా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉండగా ఇంచుమించు అదే సమయంలో హీరో అర్జున్ పర్యటన ఉండటంతో జిల్లా కేంద్రంలో కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై ఫిర్యాదులు అందడంతో ఎన్నికల సంఘం స్పందించింది.

## ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

**నిజామాబాద్, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

కేసీఆర్ పాలనా విధానాలే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని, మరోమారు ప్రజలు తమను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలన తీరుతో పోల్చుకుని బిఆర్‌ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. సోమవారం జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. ప్రజల స్పందన బాగుందని అన్నారు. ప్రజలంతా తరలివచ్చి ఓటేయాలని అన్నారు. ఓటు వేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని అన్నారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందంటే అది కెసిఆర్ చేసిన కృషి అన్నారు. కాంగ్రెస్, బిజెపిల నేతలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు వీరికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్ పూర్తి ఆధిపత్యంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో పదేళ్ల నాటికి, నేడు ఉన్న పరిస్థితులను ప్రజలు గమనించాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన కేసీఆర్ వెంట ప్రజలు నిలువాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ ఏం చేసిందో కూడా కళ్లముందుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపుతోందన్నారు.

## ఓటుహక్కు వినియోగంచుకోనున్న సెలబ్రిటీలు

**హైదరాబాద్, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

ఎన్నికల పండుగ రోజు సామాన్యులతో పాటు సెలబ్రిటీలంతా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతంలో కూడా వీరు క్యూలో నిలబడి మీర ఓటేశారు. ఎవరెక్కడ వినియోగించుకోనున్నారంటే.. ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ సెంటర్ జూబ్లీహిల్స్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్ .. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేశ్‌బాబు, నమ్రత , మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్, విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్, జీవిత, రాజశేఖర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎఫ్‌ఎన్‌సీసీలో రాఘవేంద్రరావు, విశ్వక్‌సేన్ , దగ్గుబాటి రాణా, సురేశ్ బాబు.. జూబ్లీహిల్స్ క్లబ్‌లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన , నితిన్.. జూబ్లీ హిల్స్ న్యూ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ లో రవితేజ.. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్.. మణికొండ హైస్కూల్ లో వెంకటేశ్, బ్రహ్మానందం.. షేక్ పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమౌళి, రామారాజమౌళి.. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో హీరో రామ్ పోతినేని.. గచ్చిబౌలి జిల్లా పరిషత్ పాఠశాలలో హీరో నాని.. దర్గా గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్‌లో హీరో సుధీర్ బాబు.. రోడ్ నెం.45, జూబ్లీహిల్స్ ?ఆర్థిక సహకార సంస్థలో అల్లరి నరేశ్.. యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాలలో తనికెళ్ల భరణి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం



- సీరియల్ నటి పవిత్ర జయరామ్ మృతి

**కర్నూలు, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

తెలుగు సీరియల్ ఇండస్ట్రీటో విషాదం నెలకొంది. సీరియల్ నటి పవిత్ర జయరామ్ కారు ప్రమాదంలో మరణించారు. ఈ ఉదయం ఆమె ప్రయాణిస్తున్న కారు కర్నూలు వద్ద బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పవిత్ర జయరాం అక్కడికక్కడే మరణించినట్టు సమాచారం. ప్రమాద సమయంలో కారులో పవిత్ర తోపాటు ఆమె కుటుంబ సభ్యులు కూడా ఉన్నారని తెలుస్తుంది. ఇక పవిత్ర జయరామ్ విషయానికి వస్తే.. కన్నడ ఇండస్ట్రీకి చెందిన ఆమె రోబో ఫ్యామిలీ అనే సీరియల్ ద్వారా బుల్లితెరకు పరిచయమయ్యారు. అలా కన్నడలో ఎన్నో సీరియల్స్ లో నటించిన ఆమె.. త్రినయని సీరియల్ తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఈ సీరియల్లో తిలోత్తమ పాత్ర ద్వారా తెలుగు ప్రేక్షకులను సైతం అలరించారు. ఇక పవిత్ర జయరామ్ మరణవార్తతో పరిశ్రమలో విషాదం నెలకొంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఇండస్ట్రీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

## 14న మోడీ నామినేషన్‌కు చంద్రబాబుకు ఆహ్వానం

**అమరావతి, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

ప్రధాని మోదీ మే 14న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్ సభ స్థానానికి నామినేషన్ సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమిలోని ప్రధాన పార్టీల నేతలను మోదీ ఆహ్వానించారు. ఇందులో భాగంగా తన నామినేషన్ కార్యక్రమానికి రావాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి మోదీ ఆహ్వానం పంపించారు. ఈ క్రమంలోచంద్రబాబు మంగళవారం గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో వారణాసి వెళ్తారు. మోదీ నామినేషన్ సమర్పణ కార్యక్రమ అనంతరం ఎన్డీఏ పక్షాలతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బాబు మాట్లాడతారు. అనంతరం అదే రోజు సాయంత్రం విజయవాడకు చేరుకుంటారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ఏపీలో సార్వత్రిక సమరం









- తీర్పు ఇవ్వబోతున్న ఓటరు
- జగన్, చంద్రబాబుల భవితవ్యంపై తీర్పు
- 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ
- ఉదయం 7నుంచే పోలింగ్ ప్రారంభం
- సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- భారీ బందోబస్తు మధ్య ప్రత్యేక బస్సుల్లో తరలింపు
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**అమరావతి, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

సార్వత్రిక ఎన్నికల సమరంలో అసలు ఘట్టం నేడు ఆవిష్కృతం కానుంది. ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ నేడు పోలింగ్ జరుగనుంది. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు పోటీ జరుగనుండగా ఎపిలో 25 స్థానాలకు పోటీ జరుగుతోంది. ఇక ఎపిలో 175 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రి 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఈ మేరకు పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన సామాగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రత్యేక బస్సుల్లో భారీ భద్రత మధ్య వీరిని చేరవేశారు. వానలు పడతాయన్న సమచారంతో ఇసి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇక ప్రధానంగా ఎపిలో అధికారం ఎవరిదనేది ప్రజలు నిర్ణయించబోతున్నారు. అటు టిడిపి కూటమి, ఇటు వైసిపి హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. మరోమారు అధికరాంలోకి రావడానికి జగన్ సర్వశక్తులు ఒడ్డారు. తానే స్టార్ కాంపెయినర్‌గా ప్రచారం నిర్వహించారు. ఒక్క చాన్స్‌తో గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకున్న జగన్, సంక్షేమ కార్యక్రమాల పేరుతో ప్రజల ఖాతాల్లో డబ్బులు వేస్తూ పోయారు. ఇదే తన పరిపాలనకు గీటురాయి అని, లబ్ది పొందిన వారు ఓటేయాలని ప్రచారంలో కోరారు. అధికారంలో ఉండగా విపక్ష నేతలపై కేసులతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎదురుతిరిగిన వారిని కేసులతో వేధించారు. ఈ అంశాలే ఎన్నికల్లో ప్రచారాంశాలుగా మారాయి. జగన్‌కు దీటుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీలు ప్రచారం చేపట్టారు. తిరిగి అధికారం కోసం చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎపిలో అదృష్టం ఎవరిని వరించనుందో గానీ..పోలింగ్ తీరును బట్టి అంచనావేయవచ్చు. ప్రచారంలో ఎవరు ఎవరికి తగ్గని విధంగా ప్రచారం చేసుకున్నారు. అలాగే ఈ ఎన్నికల్లో పులువురు ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబుతున్నారు. తెలుగునాట అధికార, ప్రతిపక్ష నాయకులు, జాతీయ స్థాయి నాయకులు కూడా తమ వాగ్దానాలతో ప్రజలను ఊదరగొట్టారు. ఇకపోతే పలు నియోజకవర్గాల్లో జనగ్ అబ్యర్థులను మార్చారు. చాలామంది వైకాపాను వీడారు. కొందరు టిడిపి నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో కుప్పం నుంచి చంద్రబాబు, మంగళగిరి నుంచి లోకేశ్, పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్, పులివెందుల నుంచి జగన్ పోటీలో ఉన్నారు. పగ, ప్రతీకారాలతో సాగిన జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనతో ఉక్కిరిబిక్కిరైన ప్రధాన ప్రతిపక్షాలు తెలుగుదేశం, జనసేన ఒక్కటయ్యాయి. చివరకు భారతీయ జనతా పార్టీ కూడా ఈ రెండు పార్టీలతో జట్టు కట్టింది. దీంతో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఎన్నికల బరిలోకి దిగింది. నరేంద్ర మోదీ, చంద్రబాబు మళ్లీ చేతులు కలపాల్సిన పరిస్థితి వచ్చింది. చంద్రబాబుపై అనేక కేసులు పెట్టిన జగన్ ప్రభుత్వం చివరకు స్కిల్ కేసు పేరిట 52 రోజుల పాటు జైల్లో నిర్బంధించింది. ఈ ఘటనతో తెలుగుదేశం, జనసేన మైత్రీ బంధం పటిష్ఠమైంది. జైలు నుంచి విడుదలైన చంద్రబాబు, ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించకపోతే తన రాజకీయ జీవితం ముగుస్తుందని గుర్తించి భారతీయ జనతా పార్టీతో కూడా జతకట్టారు. దీంతో రాష్ట్రంలో ప్రధాన పోరు ఎన్డీయే కూటమికీ, వైసీపీకి మధ్య జరుగుతోంది. ప్రజలు కూడా జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు. ఐదేళ్ల జగన్ పాలనలో మరో కీలక పరిణామం కూడా చోటుచేసుకుంది. 2019 ఎన్నికల వరకు జగన్‌కు అండగా ఉంటూ ఆయన కోసం పాదయాత్ర చేయడమే కాకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన చెల్లెలు షర్మిల.. జగన్ కుటుంబానికి దూరమయ్యారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబం రెండుగా చీలిపోయింది. వైసీపీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తల్లి విజయమ్మను తప్పించిన జగన్‌రెడ్డి ఆమెకు పార్టీతో సంబంధం లేకుండా చేశారు. ఇద్దరు బిడ్డలూ చెరోదారి అయిన నేపథ్యంలో ఎటూ చెప్పలేక ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. కాకపోతే ఎన్నికల ప్రచారం చివరి రోజున ఓ వీడియో సందేశం విడుదల చేశారు. కడప బరిలో అవినాశ్‌రెడ్డిపై పోటీ పడుతున్న షర్మిలకు మద్దతు ప్రకటించారు. కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న షర్మిలకు మద్దతుగా సునీత నిలిచారు. కడప నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్ రెడ్డి కోసం జగన్మోహన్ రెడ్డి తన సొంత చెల్లెలు షర్మిలను కూడా దూరం చేసుకున్నారు. నవరత్నాలు పేరిట ప్రజలకు డబ్బు పంచడమే ముఖ్యమంత్రి చేయాల్సిన గొప్ప పని అని జగన్ భావించారు. అందుకే ప్రతి కుటుంబానికి డబ్బు పంచిన తనకే మళ్లీ అధికారం అప్పగించాలని ఆయన కోరుతున్నారు. తనకు ఓటు వేయకపోతే అమలులో ఉన్న పథకాలను ఎత్తేస్తారని ఆయన ప్రచారం చేసారు. జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం అప్పులపాలు అయ్యిందన్నది నిజం. బటన్ నొక్కితే చాలు అన్నట్టుగా జగన్ పాలన సాగింది. వలంటీర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం వల్ల దాని ఏర్పాటు లక్ష్యం కూడా దెబ్బతింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణం ఆగిపోయింది. పోలవరం ప్రాజెక్టు మూలనపడింది. ఈ క్రమంలో ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది చూడాలి. 13 ఎన్నిక జరునుండగా, జూన్ 4న పలితాలు వెలువడనున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా ఓటర్లు వివిధ ప్రాంతాల నుంచి ఎపికి చేరుకున్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలతో పాటు పార్లమెంట్‌కు మే 13న పోలింగ్ జరుగుతున్న క్రమంలో రాష్ట్రం అంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. 13 తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని సిఇవో మీనా తెలిపారు. 13న 6 పోలింగ్ కేంద్రాల్లో 3 చోట్ల 4 గంటలకు, మూడు చోట్ల 5 గంటలకే పోలింగ్ ముగుస్తుందని తెలిపారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తామని వివరించారు. 13 తేదీన సరిగ్గా 7 గంటలకు పోలింగ్ మొదలు అవుతుందని ప్రకటించారు. పోలింగ్ ఏజెంట్‌కు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు ఇచ్చామన్నారు.నియోజకవర్గంలో స్థానికుడైన అభ్యర్థి నుంచి ధ్రువపత్రాల తీసుకుంటే ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్ గా అనుమతి ఇవ్వొచ్చని వివరించారు. అలాగే పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు ఎలాంటి చిహ్నాలు లేకుండా స్లీప్‌లు పంచుకోవచ్చని అన్నారు. అలాగే పోలింగ్ రోజు ప్రజల రవాణాను నిరోధించాలని ఎన్నికల సంఘం ఉద్దేశ్యం కాదన్నారు. ఓటర్లను రాజకీయ పార్టీలు తరలించడం చట్ట వ్యతిరేకమని అన్నారు. అభ్యర్థికి సంబంధించి వాహనాల పరిమితి ఉందన్నారు. మూడు వాహనాల వరకే సదరు అభ్యర్థి వినియోగించు కోవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి ప్రిసైడింగ్ అధికారి మినహా ఎవరూ ఫోన్లు తీసుకెవెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ఓటర్లు కూడా ఫోన్లు తెచ్చేందుకు అనుమతి లేదన్నారు.అలాగే ఆయుధాలతో ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించామని స్పష్టం చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ గన్ మెన్లతో పోలింగ్ కేంద్రాల్లోకి రావొద్దని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రత కోసం 1,06,145 మంది పోలీసు బలగాలను వినియోగిస్తున్నామని సీఈఓ మీనా తెలిపారు.

## తెలంగాణలో.. లోక్‌సభ సమరం

- 17 స్థానాలకు హోరాహోరీ పోటీ
- మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా సీట్లు
- డబుల్ డిజిట్‌పై కన్నేసిన కాంగ్రెస్, బిజెపి
- ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన ఇసి

**హైదరాబాద్, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సత్తా చాటాలని బిజెపి చూస్తోంది. 400 సీట్ల టార్గెట్‌లో కనీసం ఏడెనిమిది సీట్లు సాధించాలన్న పట్టుదలతో ప్రచారం నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఈ ఎన్నికల్లో విశేషం. అలాగే నడ్డా, అమిత్ షాతో పాటు ఇతర రాష్ట్రాల సిఎంలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణలో అనూహ్యంగా నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు మెజారిటీ స్థానాలు కైవశం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం నిలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. ఈ పార్లమెంట్ ఎన్నికలు ప్రధానంగా సిఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్మాత్మకం కానున్నాయి. గతంలో ఉన్న మూడు సీట్లను మించి సీట్లు సాధిస్తేనే ఆయన నాయకత్వంపై గురికుదురుతుంది. అలాగే మంత్రులకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన రేంవత్ రెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు మల్కాజిగిరి, భువనగిరి, నల్లగొండల్లో గెలుపు ముఖ్యం. అలాగే పాలమూరులోని రెండు సీట్లు కూడా సిఎం రేవంత్‌కు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. ఐదు నెలల క్రితం అధికారం కోల్పోయిన కేసీఆర్ ఒకటి రెండు స్థానాలైనా గెలుచుకొని పార్టీని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావం చూపనున్నందున మూడు ప్రధాన పార్టీలకూ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సోమవారం జరగనున్న పోలింగ్‌లో తెలంగాణ ప్రజలు ఎవరిని ఆదరించబోతున్నారో, ఎవరిని తిరస్కరించబోతున్నారో తీర్పు ఇవ్వనున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ఐదు నెలలైనా వాస్తవంలోకి రాకుండా తెలంగాణను పాలించే సమర్థత తనకు మాత్రమే ఉందన్న భ్రమల్లో ఉన్న కేసీఆర్ 12 సీట్లు గెలిస్తే తానే ప్రధాని అంటూ బీరాలు పలికారు. బహిరంగ సభల్లో కూడా అదే విధంగా మాట్లాడారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రచారం చేయడం ఆయన అధికారం కోల్పోవడం తట్టుకోలేక పోయారని నిరూపిస్తోంది. తెలంగాణలో ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలకం కానున్నాయి. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్నాయి. ఆ క్రమంలో ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. రేపు నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. ఇంకా మూడు దశలు మే 20, మే 25, జూన్ 1వ తేదీన జరగనున్నాయి. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుందీ. అదే రోజు.. దేశంలోని ఓటరు ఏ పార్టీకి అధికారం కట్టబెడతాడనే విషయం స్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం అదే రోజు లెక్కించనున్నారు. దీంతో ఆ యా రాష్ట్రాల్లోని ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది సుస్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని మొత్తం 175 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ఒడిశా అసెంబ్లీకి సైతం 4 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మే 13వ తేదీన ఆ రాష్ట్ర అసెంబ్లీకి తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 1వ తేదీన జరిగే నాలుగో దశ పోలింగ్‌తో.. ఒడిశా అసెంబ్లీకి పోలింగ్ ముగియనుంది.ఇక లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి మాధవిలత, అసదుద్దీన్ ఓవైసీ, కరీంనగర్ నుంచి బండి సంజయ్, బిహార్‌లోని బిగుసరాయి నుంచి గిరిరాజ్ సింగ్, కడప నుంచి వైయస్ షర్మిల, జార్ఖండ్‌లోని ఖుంతి నుంచి అర్జున్ ముండా, బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శతృఘ్నసిన్హా, బెహరంపూర్ నుంచి యూసఫ్ పఠాన్, అధిర్ రంజన్ చౌదరి, రాజంపేట నుంచి ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణలో బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ కిషన్ రెడ్డిలు మరోమారు పోటీ పడుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. ఆ తరవాత తెలంగాణ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. 160 కేంద్ర కంపెనీల బలగాలు రాష్ట్రంలో ఇప్పటికే మొహరించాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి 20 వేల పోలీస్ బలగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, వాటిని సీఈఓ ఆఫీస్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. లక్ష 90 వేల మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వచ్చే 48 గంటల పాటు వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని వివరించారు. 21 వేల 680 మంది ఓటర్లు హోం ఓటింగ్ వేసుకున్నారని వికాస్ రాజ్ తెలిపారు. 328 పోలింగ్ కేంద్రాలను ఏజెన్సీ ఏరియాల్లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూడు పోలింగ్ కేంద్రంలో అత్యల్ప ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్లు ఉండగా. ఇందులో సగానికి పైగా మహిళా ఓటర్లే ఉన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకుగాను 13 నియోజక వర్గాల్లో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఎండలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించింది ఎన్నికల సంఘం. 9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన ఎన్నికల సంఘం, అలాంటి ఏరియాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా పెట్టేలా ప్లాన్ చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎన్నికల సంఘం.. అలాంటి ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగాలని నిర్ణయించింది. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్నికల విధుల్లో భాగంగా కేంద్రం నుండి 175 కంపెనీలు విధుల్లో ఉండనున్నాయి. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా 14 మందిని నియమించారు. జనరల్ పరిశీలకులుగా 17 మందిని నియమించారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది సామాగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో భద్రత మధ్య చేరవేశారు.

## కొత్తపేటలో ఈదురు గాలుల వర్షం

**అంబేద్కర్ కోనసీమ, మే12(పీపుల్స్ మోటివేషన్) :**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తపేటలో పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందజేశారు. కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సిబ్బంది కొత్తపేట హైస్కూల్ గ్రౌండ్ వద్ద ఈవీఎం తదితర పరికరాలను అధికారులు అందజేశారు. అయితే అనుకోకుండా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు సిబ్బంది ఉండటానికి వేసిన టెంట్లు కూలిపోయాయి. అలాగే తమకు ఇచ్చిన సామగ్రిని తీసుకు వెళ్లేందుకు పోలింగ్ సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. వర్షం దాటికి మోకాళ్ళ లోతు నీరు బురద గ్రౌండ్ లోకి చేరడంతో ఇచ్చిన సామగ్రితో బయటపడడానికి అవస్థలు పడ్డారు.గ్రౌండ్‌లో సిబ్బంది ఎక్కిన బస్సులు ముందుకు కదలక మొరాయించాయి.దీంతో జేసీబీల సహాయంతో వాటిని ముందుకు కదిలించారు.మరోవైపు భోజన సదుపాయాలు కూడా అంతంత మాత్రం గానే ఉన్నాయని పలువురు సిబ్బంది వాపోయారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందుగానే వెల్లడించినా తగిన చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com